ప్రజల చేతిలో
www.ayudamdaily.com
ఆయుధం
The Common People's Voice
బుధవారం | ఆగస్టు 12, 2026 | సంపుటి : 7 | సంచిక : 64 | పేజీలు : 2



## భవిష్యత్ కెరీర్‌పై లక్ష్యాలు ఏర్పరచుకోవాలి: డా.అనితారెడ్డి

2 లో

# ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి .. మారు బోనం

- బోనం సమర్పించిన మంత్రి కొండా సురేఖ





**హైదరాబాద్, ఆయుధం:** ఆషాడ బోనాల ఉత్సవాల్లో భాగంగా అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ మంగళవారం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి మారు బోనం సమర్పించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ డైరక్టర్ హనుమంతరావు, అసిస్టెంట్ కమిషనర్ మనోహర్ రెడ్డి, అర్చకులు మంత్రికి డప్పు చప్పుళ్ళు, శివసత్తుల పూనకాల మధ్య ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి సురేఖ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మారు బోనం సమర్పణ కార్యక్రమంలో మంత్రి సురేఖ పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి సురేఖ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి మారు బోనం సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. బోనమెత్తిన మహిళలకు ఈ సందర్భంగా మంత్రి సురేఖ చీరె, సారె అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి మారుబోనం కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని మంత్రి కొండా సురేఖ అన్నారు. అమ్మవారికి సమర్పించిన బియ్యంతో మారు బోనం చేయడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో విశిష్టమైన ఆచారమని మంత్రి సురేఖ అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాడ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకోవడం మనందరికీ గర్వకారణమన్నారు. ఈ ఏడాది ఆషాడ బోనాల ఉత్సవాలను ప్రజలు ఆనందోత్సాహలతో జరుపుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ ఏర్పాట్లకు తోడు ప్రజల సహకారంతో ఈ ఏడాది బోనాలు వైభవోపేతంగా జరుగుతున్నాయన్నారు.

# ములుగులో ఎస్ఐఆర్ ప్రక్రియ 100 శాతం పూర్తి

- 2,36,970 మంది ఓటర్లలో 2,09,128 మంది వివరాల డిజిటలైజేషన్
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు, ఆయుధం:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ములుగు నియోజకవర్గంలో ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం జూన్ 25వ తేదీన ప్రారంభమైందని తెలిపారు. తొలి దశలో జూన్ 25 నుంచి జూన్ 30వ తేదీ వరకు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం జూలై 1 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించడంతో పాటు ఓటర్ల వివరాల పరిశీలన, ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను చేపట్టారని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, పరిశీలన, డిజిటలైజేషన్ ప్రక్రియను ములుగు నియోజకవర్గంలో నూరు శాతం పూర్తి చేసినట్లు వెల్లడించారు. ములుగు నియోజకవర్గంలో మొత్తం 2,36,970 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,09,128 మంది ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజేషన్ చేసినట్లు తెలిపారు. ఇది మొత్తం ఓటర్లలో 88.25 శాతంగా ఉందని పేర్కొన్నారు. మిగిలిన 27,842 మంది ఓటర్లను అన్‌కలెక్టబుల్‌గా గుర్తించినట్లు తెలిపారు. వీరిలో 8,354 మంది మరణించిన వారు, 4,015 మంది డబుల్ ఎంట్రీలు ఉన్నవారు, 14,207 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారు, 1,219 మంది ఆచూకీ లభించని వారు ఉన్నారని వెల్లడించారు. అన్‌కలెక్టబుల్‌గా గుర్తించిన వారి శాతం 11.75 శాతంగా ఉందన్నారు. డిజిటలైజేషన్ పూర్తయిన 88.25 శాతం, వివిధ కారణాలతో అన్‌కలెక్టబుల్‌గా గుర్తించిన 11.75 శాతం కలిపి ములుగు నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులో సమర్థవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేసిన ఎన్నికల అధికారులు, ఈఆర్ఓ, ఏఈఆర్ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలను జిల్లా కలెక్టర్ అభినందించారు.

# సీఎం సభకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి
- వరంగల్ సీపీ శ్వేతతో కలిసి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్



**పరకాల, ఆయుధం:** పరకాలలో ఈ నెల 16న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పాల్గొనే సభకు పటిష్టమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం పరకాలలో సీఎం పర్యటన నేపథ్యంలో ప్రతిపాదిత హెలిప్యాడ్, సభా వేదిక, వాహనాల పార్కింగ్, రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేతతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద సీఎం ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ప్రతిపాదిత హెలిప్యాడ్ కోసం లలితా కన్వెన్షన్ హాల్ సమీపంలోని స్థలాన్ని, సభా వేదిక, వాహనాల పార్కింగ్ కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అంగడి స్థలాలను పరిశీలించారు. సభకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున వాహనాల రాకపోకలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ, సీఎం పర్యటనలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. హెలిప్యాడ్ నుంచి సీఎం ప్రయాణించే మార్గం, ఆసుపత్రి ప్రారంభోత్సవం, సభా వేదిక, ప్రజల రాకపోకలు, పార్కింగ్, రహదారులు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత మాట్లాడుతూ.. సీఎం భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ హెలిప్యాడ్, రూట్ మ్యాప్, సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, ట్రాఫిక్ నియంత్రణకు పటిష్టమైన భద్రతా ప్రణాళిక అమలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అనంతరం సీఎం పర్యటనకు సంబంధించిన రూట్ మ్యాప్, భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ ప్రణాళికపై కలెక్టర్, పోలీస్ కమిషనర్ అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ రవి, డీఆర్డీవో మేన శ్రీను, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, ఆర్అండ్‌బీ ఎస్ఈ సురేష్‌బాబు, ఈఈ దేవిక, టీడబ్ల్యూఐడీసీ ఈఈ అరుణ్ కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, పరకాల మున్సిపల్ చైర్మన్ సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ పవన్, ఏసీపీ సతీష్ బాబు, పరకాల సీఐ క్రాంతి కుమార్, కౌన్సిలర్లు శ్రీనివాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



# జూ పార్క్ అభివృద్ధికి నిధులివ్వండి

- ఎన్‌క్లోజర్లు, నైట్ షెల్టర్లకు త్వరగా అనుమతులివ్వాలి
- జంతువుల కదలికలపై వీడియో, ఆడియో పర్యవేక్షణ ఏర్పాటు చేయాలి
- వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

ఢిల్లీ, ఆయుధం: కాకతీయ జూలాజికల్ పార్కు అభివృద్ధికి కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ (CAMPA) నిధులు మంజూరు చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. ఈ మేరకు మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర జూ అథారిటీ సభ్య కార్యదర్శి డా. వి. క్లైమెంట్ బెన్‌ను కలిసి వినతిపత్రం అందజేసి వివరించారు. హనుమకొండలోని కాకతీయ జూలాజికల్ పార్కులో సింహాల ఎన్‌క్లోజర్, నైట్ షెల్టర్, హైనా, జాకల్, వైల్డ్‌డాగ్ ఎన్‌క్లోజర్లు, నైట్ షెల్టర్లు, సరీసృపాల ఎన్‌క్లోజర్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను తెలంగాణ అటవీ శాఖ ఇప్పటికే కేంద్ర జూ అథారిటీకి సమర్పించిందని ఎంపీ తెలిపారు. సాంకేతిక కమిటీ సూచనల మేరకు సవరణలు చేసి డిజైన్లు, డ్రాయింగ్‌లు సమర్పించినందున వాటికి త్వరగా ఆమోదం ఇవ్వాలని కోరారు. సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న జూలాజికల్ పార్కులో జంతువుల సంరక్షణతో పాటు మొక్కల పెంపకం, పచ్చదనం అభివృద్ధి, పార్కు విస్తరణకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎంపీ డా.కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. కాంపా నిధులను విడుదల చేసి ఈ పనులకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జంతువుల కదలికలు, ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ వాటి సంరక్షణ,



2 లో

# దేశ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసిన ఘనత బీజేపీదే

- బీజేపీ పాలనలో రాముడికే రక్షణ లేదు
- అక్రమార్కులకు బిజెపి అడ్డగా ఉంది
- మార్పుకై సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ
- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు

# సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలి

- బల్దియా కమిషనర్ టి. వెంకన్న
- బాలసముద్రం రెండు పడకల గదుల సముదాయంలో ఎస్‌టీపీ పరిశీలన
- ఇందిరానగర్‌లో అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలు నాటిన కమిషనర్



**హనుమకొండ, ఆయుధం:** బాలసముద్రం రెండు పడకల గదుల సముదాయంలో ఏర్పాటు చేసిన సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ)ను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురావాలని బల్దియా కమిషనర్ టి.వెంకన్న ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బాలసముద్రంలోని రెండు పడకల గదుల సముదాయాన్ని సందర్శించిన కమిషనర్, అక్కడి 300 కేఎల్‌డీ సామర్థ్యం గల ఎస్‌టీపీని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌ను పునరుద్ధరించేందుకు అవసరమైన టెండర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. అనంతరం 59వ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో నిర్వహించిన అవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని, స్థానిక కాలనీ ప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. నగరంలో పచ్చదనం పెంపొందించేందుకు అవెన్యూ ప్లాంటేషన్‌ను ప్రోత్సహించాలని కమిషనర్ సూచించారు. ఈ పర్యటనలో సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, ఇన్‌చార్జి హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహేందర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్పందన తదితరులు పాల్గొన్నారు.

# 2 నెలల గరిష్ఠానికి బంగారం ధర

- 6 రోజుల్లో ₹9800..



2 లో

దేశంలో బంగారం, వెండి ధరలు మరోసారి పెరిగాయి. 10 గ్రాముల పసిడి ధర తాజాగా రూ.1200 పెరగడంతో దేశ రాజధాని దిల్లీలో పసిడి ధర రెండు నెలల గరిష్ఠమైన రూ.1.57 లక్షల స్థాయికి చేరింది. వెండి సైతం కిలోకు రూ.2 వేలు పెరిగి రూ.2.42 లక్షలకు చేరింది.




# ప్రైవేట్ యూనివర్సిటీలను వ్యతిరేకించా

- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**హనుమకొండ, ఆయుధం:** తెలంగాణ రాష్ట్రంలో తాను డిప్యూటీ సీఎం గా ఉన్న కాలంలో తాను ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటును వ్యతిరేకించానని తాను విద్యాశాఖ మంత్రిగా ఉన్నంతకాలం ప్రైవేట్ యూనివర్సిటీలను ఏర్పాటు చేయకుండా తన వంతు ప్రయత్నం చేశానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. మంగళవారం కాకతీయ విశ్వవిద్యాలయం రిటైర్మెంట్ అధ్యాపకుల సంఘం సెనేట్ హాల్లో జరిగిన సమావేశంలో కడియం శ్రీహరి మాట్లాడుతూ తాను ప్రభుత్వంలో ఉన్నంతకాలం విశ్వవిద్యాలయానికి కావలసినంత అభివృద్ధి చేయలేక పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. తాను రాజకీయాల్లోకి వచ్చి 40 సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి అవినీతి అక్రమాలకు తావివ్వకుండా చిత్తశుద్ధితో ప్రజాసేవలో ఉన్నానని గత కొన్ని ప్రభుత్వాలు ఓరుగల్లు నక్సలైట్, లెఫ్టిస్టుల జిల్లాగా పరిగణిస్తూ తగినంత అభివృద్ధి చేయలేక పోయారని అన్నారు. తెలంగాణలోని యూనివర్సిటీ అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలనే తపన నాలో ఉన్నప్పటికీ ఆదేశాన్ని ఆదేశాల మేరకు భక్తి చేయలేక పోవడం బాధగా ఉందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న విశ్వవిద్యాలయాల్లో నాణ్యమైన విద్యను అందించలేక పోతున్నామని.. ఇప్పుడున్న రోజుల్లో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని విశ్వవిద్యాలయాల్లో సరియైన రీసర్చ్‌లు జరగడం లేదని అన్నారు. ఆశించిన స్థాయిలో విశ్వవిద్యాలయాలు ముందు భాగంలో నిలువలేకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ, మాజీ రీస్టార్ట్ సదానందం, తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.



# ప్రతిఒక్కరూ రాజ్యాంగ హక్కులు, బాధ్యతలు తెలుసుకోవాలి

- హనుమకొండ కేడీసీలో హర్ ఘర్ తిరంగా
- కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



# కాంగ్రెస్‌లో గుర్తింపు లేదు

- పేదలకు సేవ చేసే దృక్పథంతోనే జనసేనలోకి వచ్చాను
- అధిష్ఠానం ఆదేశాల మేరకు నడుచుకుంటా
- జనసేనలో చేరిన కరాటే ప్రభాకర్




# ఫొటో జర్నలిస్టు మెరుగు ప్రతాప్‌కు ఏపీపీజేఏ అచీవ్‌మెంట్ అవార్డు

**వరంగల్, ఆయుధం:** ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏపీపీజేఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటో జర్నలిజం అవార్డుల్లో నమస్తే తెలంగాణ రాజన్న సిరిసిల్ల జిల్లా ఫొటో జర్నలిస్టు మెరుగు ప్రతాప్‌కు అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. ఫార్మ్ వర్కర్స్ (వ్యవసాయ కూలీలు) అంశంపై ఆయన చిత్రీకరించిన ఫొటోకు ఈ అవార్డు దక్కింది. ఫొటో జర్నలిజం ద్వారా గ్రామీణ జీవనం రైతులు, వ్యవసాయ కూలీల శ్రమను ప్రతిబింబించినందుకు ఏపీపీజేఏ ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. విజయవాడలోని ఏపీపీజేఏ కార్యాలయం విడుదల చేసిన అవార్డుల జాబితాలో మెరుగు ప్రతాప్ పేరును ప్రకటించారు. ఈ సందర్భంగా మెరుగు ప్రతాప్‌కు పలువురు పాత్రికేయులు, ఫొటో జర్నలిస్టులు అభినందనలు తెలిపారు.



# కాంగ్రెస్‌లో గుర్తింపు లేదు

- పేదలకు సేవ చేసే దృక్పథంతోనే జనసేనలోకి వచ్చాను
- అధిష్ఠానం ఆదేశాల మేరకు నడుచుకుంటా
- జనసేన నాయకుడు కరాటే ప్రభాకర్ వ్యాఖ్యలు

**వరంగల్, ఆయుధం:** ఏళ్ల తరబడి కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేస్తున్నా గుర్తింపు లేదని జనసేన పార్టీ నాయకులు కరాటే ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం వరంగల్‌లోని ఆయన నివాసంలో జనసేన పార్టీ నాయకులతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. వరంగల్ లో గత 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి ఎంతగానో కృషి చేశానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పుడు అనేక రకాలుగా ఇబ్బందులు పడ్డానని తెలిపారు. ప్రస్తుతం.. కాంగ్రెస్ పార్టీ వరంగల్ తూర్పులో మూడు ముక్కలాట అయిపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడికి పదవి ఇస్తే కనీస గౌరవం, గుర్తింపు లేకుండా కొందరు చేస్తున్నారని ఆరోపించారు. తూర్పు నియోజకవర్గం పరిధిలో వచ్చిన పదవులను నీకు ఒకటి నాకు ఒకటి అనేలా సినిమా టికెట్ల లాగా పంచుకుంటున్నారని విమర్శించారు. తనను ఎన్నో విధాల ఒత్తిళ్లకు గురి చేశారని వాపోయారు. తాను పవన్ కల్యాణ్ కోసం పార్టీలోకి రాలేదని.., పవన్ కళ్యాణ్ కు పేదలకు మంచి చేయాలని దృక్పథం ఉంది కాబట్టి వచ్చానని కరాటే ప్రభాకర్ వెల్లడించారు. జనసేన అధిష్టానం ఆదేశాల మేరకు పేద ప్రజల అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి వరంగల్ తూర్పులో జనసేన పార్టీలోకి చాలామంది రానున్నారని ప్రభాకర్ తెలిపారు.

## నేడు పద్మశాలి సర్పంచులు, చేనేత సంఘాల

# నేతలకు అభినందన సభ

**హనుమకొండ, ఆయుధం:** పద్మశాలి గ్రామ సర్పంచులు, చేనేత సహకార సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులకు తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం హన్మకొండ జిల్లా ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం బుధవారం హన్మకొండ ప్రశాంత్‌నగర్‌లోని 'వి గ్రాండ్ బాంక్వెట్ హాల్'లో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన 12 మంది పద్మశాలి సర్పంచులు, అలాగే 18 చేనేత సహకార సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఘనంగా సత్కరించనున్నారు. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం హన్మకొండ జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం అధ్యక్షత వహించనున్నారు. కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల శాఖ పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి పలువురు రాష్ట్ర స్థాయి నాయకులు, ప్రముఖులు విశిష్ట అతిథులుగా, ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేయనున్నారు. వైద్యం రాజగోపాల్ (రాష్ట్ర ఉపాధ్యక్షులు), వడ్నాల నరేందర్ (రాష్ట్ర ఉపాధ్యక్షులు), తౌటం రవీందర్ (రాష్ట్ర కార్యదర్శి), పులికంటి రాజేందర్ (రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి). ప్రత్యేక ఆహ్వానితులుగా గడ్డం కేశవమూర్తి (టీయూడబ్ల్యూజే/ఐజేయూ హన్మకొండ జిల్లా అధ్యక్షుడు), వేముల నాగరాజు (ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు), మేన శ్రీమ (ప్రాజెక్ట్ డైరెక్టర్, డీఆర్‌డీఏ), ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ (రిటైర్డ్), కొప్పు సత్యనారాయణ (ఏసీపీ రిటైర్డ్), బొప్ప శివ శంకర్ (ఈసీ మెంబర్), గుర్రపు కోటేశ్వర్ (ఈసీ మెంబర్), వెంగళ వేణుగోపాల్ (సంయుక్త కార్యదర్శి), తౌటం ఝాన్సీరాణి (కమలాపూర్ ఏఎంసీ చైర్మన్), బింగి సతీష్ (భద్రకాళి దేవాలయం ధర్మకర్త). సంఘం బాధ్యులు: పోరండ్ల రమేష్, పొట్టబత్తిని విజయ్ కుమార్, నల్ల సత్యనారాయణ, గజ్వెల్లి రవీందర్ (ఉపాధ్యక్షులు); కేదాసి వెంకన్న, దిడ్డి రమేష్ (ప్రధాన కార్యదర్శులు); సత్కూరి సంతోష్ (కోశాధికారి); కుసుమ శ్యాంసుందర్, తుమ్మ శోభన్ బాబు, దుంపేటి రవీందర్, మార్త భిక్షపతి, గైని సత్యనారాయణ (కార్యదర్శులు); పోరండ్ల కృష్ణ ప్రసాద్ (యువజన సంఘం అధ్యక్షుడు), కందకట్ల ప్రశాంత్ (యువజన సంఘం కార్యదర్శి) తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.



# నీట్ రాష్ట్ర టాపర్ సహ్యాకు సన్మానం

**హనుమకొండ, ఆయుధం:** ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన జాతీయ స్థాయి నీట్ పరీక్షలో రాష్ట్ర టాపర్ గా నిలిచిన వీరయ్యగారి సహ్యాను తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం, వరంగల్ ఉమ్మడి జిల్లా విశ్వబ్రాహ్మణ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (వోపా) పక్షాన ఘనంగా సన్మానించారు. మంగళవారం హనుమకొండలోని వారి గృహంలో తల్లి దండ్రులు డాక్టర్ రమాకాంత్, శ్రీదేవి సమక్షంలో సహ్యాను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ సహ్యా జాతీయ స్థాయిలో 13 వ ర్యాంకు, దక్షిణ భారత స్థాయిలో మొదటి ర్యాంకు సాధించడం విశ్వబ్రాహ్మణ జాతికి గర్వకారణమన్నారు. చిరంజీవి వీరయ్యగారి సహ్యా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత ఫలితాలు సాధించి విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ జాతి ఔన్నత్యాన్ని నిలబెట్టే విధంగా ముందుకు సాగాలని కోరారు. ఈ సందర్భంగా సహ్యా తల్లిదండ్రులు డాక్టర్ రమాకాంత్, డాక్టర్ శ్రీదేవిలను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, వరంగల్ ఉమ్మడి జిల్లా వోపా అధ్యక్షులు శ్రీరామోజు నాగరాజారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, ప్రధాన కార్యదర్శి మహేశ్వరం ప్రభాకర్, ఉపాధ్యక్షులు ఆకోజు సురేందర్ రావు, పొనుగోటి సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ రాజ్యాంగ హక్కులు, బాధ్యతలు తెలుసుకోవాలి

- హనుమకొండ కేడీసీలో హర్ ఘర్ తిరంగా
- కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ, ఆయుధం:** రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు పౌరులుగా మన బాధ్యతలను కూడా ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అన్నారు. మంగళవారం హనుమకొండ లోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (CBC) వరంగల్ ఫీల్డ్ కార్యాలయం ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' పై రెండు రోజుల ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ అండ్ ఔట్రీచ్ ప్రోగ్రాం (ICOP), ఫోటో ఎక్సిబిషన్ ను పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన అనంతరం వరంగల్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ తరుణ్ కుమార్ బోడా సీబీసీ రూపొందించిన జాతీయ పతాకం యొక్క ప్రస్థానం, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల పై ఫోటో ఎగ్జిబిషన్‌లోని అంశాలను వివరించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి పోలీస్ కమిషనర్ ప్రసంగిస్తూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలను కాపాడటంతో పాటు దేశ అభివృద్ధిలో యువత క్రియాశీలకంగా భాగస్వాములు కావాలని సూచించారు. మన రాజ్యాంగంలో రాసుకున్న హక్కులు, బాధ్యతలు ఏవైతే ఉన్నాయో పౌరులుగా మన బాధ్యత ఏంటి అనేవి ఇలాంటి కార్యక్రమాలు మనకి గుర్తు చేస్తాయన్నారు. ఎప్పుడూ మనం హక్కుల కోసం పోరాడడం అనేది ఒక నాణేనికి ఒక వైపు మాత్రమే. ఇంకోవైపు మన బాధ్యత ఏముంది అనేది తప్పనిసరిగా తెలుసుకోవాలన్నారు.

మనకి దక్కిన స్వాతంత్ర్యానికి మనం గౌరవం, విలువ ఇస్తూ, భవిష్యత్తు తరాలకి ఎటువంటి సమాజాన్ని అందిస్తామో అనేది మనపైనే ఆధార పడి ఉంటుందన్నారు. దేశాభివృద్ధి, భవిష్యత్తు యువత పైనే ఆధారపడి ఉందన్నారు. మిమ్మల్ని మీరు ఎలా మలుచుకుంటారు అనేది మీ చేతుల్లోనే ఉంటుందని యువతను ఉద్దేశించి అన్నారు. మీ జీవితాలు మీరు ఎలా మలుచుకుంటారు అనేది వందకి వంద శాతం మీ చేతుల్లోనే ఉంటుందని, కష్టపడి మన జీవితాన్ని మనమే మెరుగుపరచుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ కేంద్ర సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. అలాగే క్విజ్, వక్తృత్వ, వ్యాసరచన పోటీలలో విద్యార్థులు చాలామంది ఉత్సాహంగా పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటం, స్వాతంత్ర్యం కోసం జరిగిన త్యాగాలు, పోరాటాల జ్ఞాపకాలు ఎప్పటికీ గుర్తుంచుకోవాలన్నారు. స్వతంత్ర భారతదేశంలో జన్మించడం మన అదృష్టం అని అన్నారు. ఇంత గొప్ప ప్రజాస్వామ్య వ్యవస్థను వారసత్వంగా పొందడం మనకు లభించిన గొప్ప అవకాశమని తెలిపారు. మన రాజ్యాంగాన్ని పొందడం మన అదృష్టం అని పేర్కొన్నారు. ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు మనకు ఉన్నాయని అన్నారు. దేశ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 15వ తేదీని, జనవరి 26వ తేదీని ఎంతో ఘనంగా జరుపుకుంటామని, ఇలాంటి కార్యక్రమాలను కూడా ప్రతి సంవత్సరం స్వాతంత్ర్యం వెనుక ఎంతటి కృషి, త్యాగం, పోరాటం దాగి ఉందో మనం ఎప్పటికీ మరచిపోకూడదనే ఉద్దేశంతో నిర్వహిస్తుంటామని అన్నారు. మనం ఈరోజు చూస్తున్న జాతీయ పతాకం ఒక్క రోజులో రూపుదిద్దుకున్నది కాదు అని దాని వెనుక ఎన్నో సంవత్సరాల కృషి, ఎన్నో పోరాటాలు ఉన్నాయని తెలిపారు. మనం పొందిన స్వేచ్ఛను, మనకు లభించిన ఈ ప్రజాస్వామ్య వ్యవస్థను ఎంతో కృతజ్ఞతతో గుర్తుంచుకోవాలని అన్నారు. మనకు లభించిన ఈ స్వేచ్ఛను కాపాడుకోవడంతో పాటు, భవిష్యత్ తరాలకు మరింత బలమైన ప్రజాస్వామ్యాన్ని అందించేందుకు మన వంతు కృషి చేయాలన్నారు. కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్ర సమాచార శాఖ ఆధ్వర్యం లో నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా' పై పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు. విద్యార్థులలో దేశం పట్ల బాధ్యత పెంపొందించటానికి ఇటువంటి కార్యక్రమాలు అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో కళా బృందాలు 'హర్ ఘర్ తిరంగా' పై ప్రదర్శించిన యక్షగానం విద్యార్థులను ఆకట్టుకుంది. క్విజ్, వక్తృత్వ, వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రజనీ లత, ప్రోగ్రామ్ ఇన్చార్జి సమత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భవిష్యత్ కెరీర్‌పై లక్ష్యాలు ఏర్పరచుకోవాలి



**వరంగల్, ఆయుధం:** కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ (UCETW), కాకతీయ విశ్వవిద్యాలయంలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థినుల కోసం ఇండక్షన్ ప్రోగ్రామ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. బిక్షాలు ప్రారంభించారు. కార్యక్రమంలోని ఉదయం మొదటి సెషన్‌కు కాకతీయ విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలు, మోటివేషనల్ స్పీకర్ అనితా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన విద్యార్థినులను ఉద్దేశించి ప్రేరణాత్మకంగా ప్రసంగించారు. విద్యార్థులు తమ విద్యాభ్యాసంతో పాటు భవిష్యత్ కెరీర్‌పై స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని సూచించారు. కెరీర్ గైడెన్స్, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం, ఆత్మవిశ్వాసం, సమయపాలన మరియు భవిష్యత్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం వంటి అంశాలపై విలువైన సూచనలు అందించారు. రెండవ సెషన్‌లో వెంకటేష్ తూర్పాటి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, యూనిట్-II, UCETW, కాకతీయ విశ్వవిద్యాలయం విద్యార్థినులకు ఎన్ఎస్ఎస్ ప్రాముఖ్యతను వివరించారు. ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థులు సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడం, సామాజిక బాధ్యతను అలవర్చుకోవడం, సేవా భావాన్ని పెంపొందించుకోవడం వంటి అనేక ప్రయోజనాలను వివరించారు. కళాశాలలో నిర్వహించే ఎన్ఎస్ఎస్ కార్యకలాపాలు, సామాజిక అవగాహన కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య అవగాహన, స్వచ్ఛత కార్యక్రమాలు తదితర సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమానికి సెషన్ ఇన్‌చార్జ్ ఎ.శ్రీనివాస్ వ్యవహరించారు. నూతనంగా చేరిన విద్యార్థినులు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, వక్తలు అందించిన సూచనలు మరియు సమాచారాన్ని ఆసక్తిగా స్వీకరించారు.

ఇండక్షన్ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థినులకు కళాశాల వాతావరణం, విద్యా అవకాశాలు, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమం నూతన విద్యార్థినులకు వారి విద్యా ప్రయాణాన్ని ఆత్మవిశ్వాసంతో ప్రారంభించేందుకు ఎంతో ఉపయోగకరంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఫస్ట్ ఇయర్ ఇంచార్జ్ డాక్టర్ జోత్స్న, అధ్యాపకులు జి.కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసిన ఘనత బీజేపీదే

- బీజేపీ పాలనలో రాముడికే రక్షణ లేదు
- అక్రమార్కులకు బిజెపి అడ్డగా ఉంది
- మార్పుకై సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ
- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు
- హనుమకొండ మండలంలో సిపిఐ ప్రచార జాతలో తక్కలపల్లి



**హనుమకొండ, ఆయుధం:** కేంద్ర బీజేపీ ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసిన ఘనతను సొంతం చేసుకుందని, రామభక్తులం అని చెప్పుకునే మోదీ, అమిత్ షా, బిజెపి నేతలు వారి పాలనలో అయోధ్య రాముడికి రక్షణ లేకుండా పోయిందని, అక్రమార్కులకు బిజెపి అడ్డగా ఉందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ సమితి పిలుపు మేరకు ఆగస్టు 6న కాజీపేటలో ప్రారంభమైన సిపిఐ ప్రచార జాత యాత్ర సోమవారం 5వ రోజున హనుమకొండ మండలానికి చేరుకొని జీటి రెడ్డి నగర్ నుండి ప్రచార జాత పాదయాత్ర పుర వీధుల మీదగా పలువేల్పుల వరకు ఉత్సాహపూరితంగా సాగింది. హనుమాన్ నగర్ చేపల బ్రిడ్జ వద్ద జాత బృందానికి హనుమకొండ మండల పార్టీ ఘన స్వాగతం పలికారు. బతుకమ్మలతో, కోలాట బృందాలతో జాత పాదయాత్ర కొనసాగింది. హనుమాన్ నగర్ కేంద్రంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైనా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ రామభక్తులం అని చెప్పుకునే మోదీ, అమిత్ షా, బిజెపి నేతలు వారి పాలనలో అయోధ్య రామాలయం రూ.200 కోట్ల చోరీ చోరీ జరిగితే ఇంతవరకు విచారణ చేయలేదన్నారు. అయోధ్య రామాలయం రూ.200 కోట్ల రూపాయల చోరీపై రామ భక్తులకు మోడీ, షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అక్రమార్కులకు బిజెపి అడ్డగా ఉందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం వంద రోజులలో నిత్యవసర వస్తువుల ధరలు అదుపులోకి తెచ్చి ప్రజల ఇబ్బందులను తొలగిస్తామని, నిరుద్యోగులకు ఉపాధి కోసం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన మాటలు అధికారం చేపట్టిన తర్వాత నీటి మూటలే అయ్యాయని వారు ఆరోపించారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు గత యూపీఏ ప్రభుత్వం చేతకాని ప్రభుత్వమని ఆకాశాన్ని అంటుతున్నాయని, మేము అధికారంలోకి వస్తే ధరలు తగ్గించి ప్రజల కొనుగోలు శక్తి చేసే విధంగా అందుబాటులోకి తీసుకువస్తామని, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చాక మూడు నల్ల చట్టాలు తీసుకువచ్చి ప్రజలను ఇబ్బంది పెట్టే విధంగా తీసుకువస్తే రైతులు తిరుగుబాటు చేసినందున కేంద్ర ప్రభుత్వం ఆయా నల్ల చట్టాలను వెనక్కు తీసుకోక తప్పలేదని అన్నారు. వ్యవసారంగానికి సబ్సిడీ ఎత్తివేశారని, గిట్టుబాటు ధరలు లేవని, విదేశాలలో మొలుగుతున్న నల్లధనాన్ని వెలికి తీసి ప్రతి పౌరుడికి 15 లక్షల రూపాయలు అకౌంట్ లో వేస్తామని చెప్పి పెద్ద నోట్ల మార్పిడి చేసి ఏ ఒక్కరి పైన ఇంత వరకు చర్య తీసుకుపోవడం పాపన పోలేదని అన్నారు. బ్యాంకులను, ఎల్ఐసి, రైల్వేలను, రక్షణ రంగం తదితర వాటిని ప్రైవేటుపరం చేసే దిశగా మార్చడం దేశ దౌర్భాగ్యానికి నిదర్శనమని అన్నారు. బిజెపి పాలనకు వ్యతిరేకంగా సిపిఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్త పాదయాత్రలు ఆగస్టు 6 నుండి ప్రారంభమైన ఈ దేశవ్యాప్త పాదయాత్రలు వివిధ జిల్లాలు, గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల గుండా సాగుతూ అట్టడుగు వర్గాల ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై, ఈ జాత ద్వారా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రజలకు వివరిస్తూ ప్రతి గ్రామంలో ఉన్న ప్రజా సమస్యల పైన పోరాటాలు కొనసాగిస్తూ మార్పు రావాలి మోడీ ప్రభుత్వం దిగాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1వ తేదీన ఛలో ఢిల్లీ పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 6వ తేదీ నుండి 11వ తేది వరకు జరిగే సిపిఐ ప్రచార జాత పాదయాత్రలను, సెప్టెంబర్ 1 తేదీన ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో జరగబో బద్లావ్ జరూరిహై ర్యాలీతో ముగుస్తాయని తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీన ఛలో ఢిల్లీ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్ జిల్లా నాయకులు మునిగాల బిక్షపతి, కర్రె లక్ష్మణ్, కొట్టెపాక రవి, మాలోత్ శంకర్ నాయక్, శనిగరపు రాజ్ కుమార్, రసమల్ల దీన, దామెర సుదర్శన్, అలువాల రాజు, మండల నాయకులు పొనుగోటి రాముగోపాల్ చారి, పూజారి అమృతయ్య, మామునూరి దామోదర్, కేతపాక ప్రసాద్, తాటికొండ ప్రశాంత్, మాలోత్ మంగ, తాటికంటి మమత, నలువాల సంధ్య, గుంటీ రజిత ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు గడ్డం రాజనర్సు, రోంటాల శ్యామ్, అధిక సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్

**హనుమకొండ, ఆయుధం:** నెలవారీ తనిఖీల్లో భాగంగా హనుమకొండలోని రెడ్‌క్రాస్ భవనం వెనుక ఉన్న ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గోడౌన్‌లోని స్ట్రాంగ్‌రూమ్ సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఈవీఎం గోడౌన్ భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా భద్రతా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. భద్రతా సిబ్బంది షిఫ్టుల వారీగా కేటాయించిన విధులను సమయపాలనతో నిర్వహిస్తూ, గోడౌన్ భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. గోడౌన్ నిర్వహణకు సంబంధించిన రికార్డులు, భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అన్ని నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులకు తెలిపారు.



## ప్రాథమిక పాఠశాలలో ఉచిత

# యూనిఫాం పంపిణీ

**నడికూడ, ఆయుధం:** మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచిత యూనిఫాం పంపిణీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కందికట్ల రమ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు ఉచిత యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రమ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం అందిస్తున్న ఉచిత యూనిఫాం వంటి సంక్షేమ కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో, చక్కగా పాఠశాలకు హాజరై మంచి విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ, విద్యార్థులలో సమానత్వ భావనను పెంపొందించడంతో పాటు, పాఠశాల పట్ల ఆసక్తి మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు ఉచిత యూనిఫాం పంపిణీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కంచ రాజ్ కుమార్, పుల్లూరి రామకృష్ణ, ప్రీ ప్రైమరీ స్కూల్ టీచర్ బండి శ్వేత, అంగన్వాడీ టీచర్ భీముడి లక్ష్మి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జూ పార్క్ అభివృద్ధికి

# నిధులివ్వండి

(మొదటి పేజీ తరువాయి..)

భద్రతను పర్యవేక్షించేందుకు వీడియో, ఆడియో రికార్డింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎంపీ సూచించారు. ఆధునిక పర్యవేక్షణ సదుపాయాలతో జంతువుల సంరక్షణ మరింత సమర్థంగా చేపట్టవచ్చని తెలిపారు. కాకతీయ జూలాజికల్ పార్కును వన్యప్రాణి సంరక్షణ, పర్యావరణ విద్య, ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేస్తే వరంగల్‌కు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరగడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు, ఆర్థిక కార్యకలాపాలు మెరుగుపడతాయని ఎంపీ పేర్కొన్నారు. ఎంపీ డా. కడియం కావ్య చేసిన విజ్ఞప్తులపై కేంద్ర జూ అథారిటీ సభ్య కార్యదర్శి డా. వి. క్లైమెంట్ బెన్ సానుకూలంగా స్పందించారు. కాకతీయ జూలాజికల్ పార్కు అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించి, నిబంధనల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య వెల్లడించారు.

# 2 నెలల గరిష్ఠానికి బంగారం ధర

- 6 రోజుల్లో 10 గ్రాములకు ₹9800

**ఢిల్లీ, ఆయుధం:** దేశంలో బంగారం, వెండి ధరలు మరోసారి పెరిగాయి. 10 గ్రాముల పసిడి ధర తాజాగా రూ.1200 పెరగడంతో దేశ రాజధాని దిల్లీలో పసిడి ధర రెండు నెలల గరిష్ఠమైన రూ.1.57 లక్షల స్థాయికి చేరింది. వెండి సైతం కిలోకు రూ.2 వేలు పెరిగి రూ.2.42 లక్షలకు చేరింది. అంతర్జాతీయంగా చమురు మంటలు కొనసాగుతున్నా ట్రేడర్ల నుంచి బలమైన డిమాండ్ కారణంగా బంగారం ధరలు పెరుగుతున్నాయి. గడిచిన ఆరు రోజుల్లో 10 గ్రాముల పసిడి ధర మొత్తంగా రూ.9800 మేర పెరిగింది. 10 గ్రాముల పసిడి ధర జూన్ 12న రూ.1.56 లక్షలు ఉండగా.. ఇప్పుడు మళ్లీ అదే స్థాయికి చేరింది. ఆగస్టు 3న బంగారం ధర రూ.1.47 లక్షలుగా ఉంది. అటు వెండి సైతం కిలో రూ.2 వేలు పెరిగి రూ.2.42 లక్షలకు చేరింది. ఏప్రిల్ 30న చివరిసారిగా వెండి ఈ ధర పలికింది. అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ ఔన్సు 4399 డాలర్లు, వెండి ఔన్సు 65 డాలర్లు చొప్పున ట్రేడవుతున్నాయి. దీన్ని అనుసరించి మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లోనూ పసిడి ధర రూ.1.57 లక్షలు, వెండి రూ.2.42 లక్షలు చొప్పున పలుకుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4,435 డాలర్ల స్థాయికి చేరినప్పుడూ చమురు ధరల్లో పెరుగుదల కారణంగా ధరలు దిగి వచ్చాయి. ఇప్పుడు కూడా హర్మూజ్‌ను తెరిచే విషయంలో అనిశ్చితి కొనసాగుతున్న వేళ క్రూడాయిల్ ధరలు అధిక స్థాయిలో కొనసాగుతున్నాయి. అయినప్పటికీ.. బంగారం, వెండి ధరలు గరిష్ఠ స్థాయిలో కొనసాగుతున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695